క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపు పర్యాటకులకు వరం



భక్తులు, పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహానంది: జీఎస్టీ తగ్గింపు పర్యాటకులకు ఎంతో మేలు చేకూరుస్తుందని పర్యాటక శాఖ జిల్లా అడ్మిన్ నాగార్జునరావు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై బుధవారం పర్యాటక ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మహానందితో పాటు అహోబిలం, బెలూం గుహలు పర్యాటక ప్రదేశాల వద్ద యూనిట్ ఇన్‌చార్జ్‌లు, అధికారులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు పర్యాటక ప్రదేశాలను తిలకిస్తూ ఆనందం, ఆహ్లాదం పొందేలా ఉంటుందన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా పాల్గొన్నారు.

ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: స్థానిక రైతుసేవా సంఘం కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ స్టేట్ సెక్రటరీ, రైతుసేవా సంఘం గౌరవాధ్యక్షులు మోమిన్ మున్నీర్‌బాషా, రైతు సేవా సంఘం అధ్యక్షులు బైరాపురం రహమతుల్లా, రైతు భరోసా కమిటీ మాజీ చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా తదితరులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. బుధవారం స్థానిక బీసీ హాస్టల్‌లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా సార్స్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మహేష్, స్వచ్ఛంధ సంస్థ జిల్లా మేనేజర్ పుల్లన్న, వలంటీర్ రత్నాకర్ పాల్గొన్నారు.

కొలను భారతి ఆలయ అభివృద్ధికి కృషి



అమ్మవారిని దర్శించుకుంటున్న దృశ్యం

కొత్తపల్లి: కొలను భారతి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి అన్నారు. మండలంలోని కొలనుభారతి క్షేత్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. సరస్వతి దేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధాని పర్యటనపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని పర్యటనను అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, ఆలయ చైర్మన్ వెంకటనాయుడు ఉన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

కోవెలకుంట్ల: డీఎస్సీ తర్వాత మిగిలిన ఖాళీ పోస్టుల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని రాష్ట్ర జాతీ య ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఆయన బుధవారం మాట్లా డుతూ.. ఈ ఏడాది జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో చాలా మంది రిలీవర్ వచ్చే వరకు పాత పాఠశాలల్లోనే కొనసాగాలని, వేతనం మాత్రం బదిలీ పొందిన పాఠశాలల్లో తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారిని నియమించి రిలీవ్ చేస్తారని ఆశపడ్డారన్నారు. డీఎస్సీ ప్రక్రియ ద్వారా కొన్నిచోట్ల ఖాళీలు భర్తీ కాక బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఖాళీ పోస్టుల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు.

ఆశలన్నీ మోదీ పైనే!

- మాస్టర్ ప్లాన్‌తో శ్రీశైల క్షేత్ర అభివృద్ధి
- రూ.1657.28 కోట్లతో ప్రతిపాదనలు
- కేంద్రం ఇవ్వాల్సింది రూ.1,022.47 కోట్లు

శ్రీశైలం టెంపుల్: దేశంలో జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం ఒకే ప్రాంగణంలో కలగలసి ఉన్న ఏకైక క్షేత్రం శ్రీశైలం. అంతటి ప్రాశస్త్యం ఉన్న మహాక్షేత్రం ఇలలో వెలసిన కైలాసంగా విరాజిల్లుతోంది. స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇంతటి వైభవోపేతమైన శ్రీశైల క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని శుక్రవారం శ్రీశైలం రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని భక్తులు కోరుతున్నారు. శ్రీశైల ఆలయ అధికారులు కూడా శ్రీశైల క్షేత్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యాలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రధాని ముందు ఉంచనుంది. రాబోయే 50 ఏళ్లలో క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రూ.1,657 కోట్లతో మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశారు. మోదీ నోట వరాల జల్లు కురిపించాలని భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను భక్తులు వేడుకుంటున్నారు.


2014 నుంచే మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులు

శ్రీశైల మహాక్షేత్రంలో 2014లో మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులు చేపట్టారు. సుమారు రూ.200కోట్లతో మాడ వీధుల అభివృద్ధి, ఔటర్ రింగ్‌రోడ్డు, క్షేత్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, సిద్ధిరామప్పషాపింగ్ కాంప్లెక్స్, వసతి సముదాయాలు, ఉభయ ఆలయాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రస్తుతం రాబోయే 50 ఏళ్లలో క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. ఉజ్జయిని, కాశీ జ్యోతిర్లింగ క్షేత్రాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసినట్లు శ్రీశైల క్షేత్రానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి క్షేత్రాభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉంది. ఈనెల 16న శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం వస్తున్నారు. దర్శనం అనంతరం జ్యోతిర్లింగ క్షేత్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవస్థాన అధికారులతో పాటు పలువురు భక్తులు ఆశలు పెట్టుకున్నారు. అయితే మోదీ అధికారులు, భక్తుల ఆశలపై నీళ్లు చల్లుతారో, నిధులు మంజూరు చేస్తారో వేచి చూడాల్సిందే.



టెంపుల్ కారిడార్ అభివృద్ధికి రూ.1,022.47కోట్లతో మాస్టర్‌ప్లాన్

కేంద్ర ప్రభుత్వం జ్యోతిర్లింగ క్షేత్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ ఆయా జ్యోతిర్లింగ క్షేత్రాల అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. ఇందులో భాగంగా కేదారనాథ్, రామేశ్వరం, భద్రీనాథ్, కాశీ, మహాకాళేశ్వరం క్షేత్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రానికి కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేలా ఆయా పథకాలను మాస్టర్‌ప్లాన్‌లో రూపొందించారు. ఇందులో భాగంగా రూ.1,022.47కోట్ల అంచనాలతో టెంపుల్ కారిడార్ అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.



శ్రీశైల మహాక్షేత్రంలో మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనలు

ప్రతిపాదనల వివరాలు..

- స్కంద పురాణంలోని శ్రీశైలం ఖండం ఆధారంగా 'ఇలకైలాసం' పేరుతో ఉజ్జయిని, వారణాసి లాగా టెంపుల్ కారిడార్ అభివృద్ధికి రూ.500 కోట్లు అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- శివమార్గ్ పేరుతో ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.100 కోట్లు
- కైలాస మానస సరోవరం (ఏనుగుల చెరువు) అభివృద్ధికి రూ.25కోట్లు
- ప్రధాన ఆలయానికి ముందు కైలాస కళాక్షేత్రం అభివృద్ధికి రూ.25కోట్లు
- కైలాస వీధులు (మాడవీధులు) బ్యూటిఫికేషన్, స్ట్రీట్ స్కేపింగ్ అభివృద్ధికి రూ.25 కోట్లు
- అఖండజ్యోతి ఏర్పాటుకు రూ.4 కోట్లు
- 3,500 చదరపు అడుగుల్లో అధునాతన వసతులతో కూడిన క్యూకాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.190.16 కోట్లు
- ప్రసాదం పోటు ఆలయం బయట నిర్మాణం కోసం రూ.12.87కోట్లు
- క్షేత్ర పరిధిలో భక్తులకు అడ్డంకులు లేని వాతావరణం ఏర్పాటుకు రూ.45.44కోట్లు
- ఘాట్‌రోడ్డు విస్తరణకు రూ.75 కోట్లు
- సీప్లేన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

శుభకార్యం



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

డోన్: రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, చంద్రలక్ష్మి దంపతుల కుమారుడు రాజ్ కుమార్, ప్రియాంక భార్గవి వివాహ కార్యక్రమానికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని వారి స్వగృహంలో బుధవారం జరిగిన శుభకార్యానికి శిల్పా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, క్లస్టర్ యూనివ ర్సిటీ సభ్యులు ముడియాల నాగభూషణంరెడ్డి, పార్టీ వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టుపసా ద్, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి జాకీర్ హుసేన్, మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ మండలాధ్యక్షులు సోమేష్ యాదవ్, నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, శేఖర్ యాదవ్, రఫీ, పార్టీ కార్యనిర్వాహకులు మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో రాజకీయ జెండాతో ఉన్న ఫ్లెక్సీని దేవస్థాన అధికారుల ఆదేశాల మేరకు తొలగించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలతో పాటు జనసేన పార్టీ కండువా మెడలో వేసుకున్న దేవకీ వెంకటేశ్వర్లు ఫొటోతో వాసవీసత్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయమై బుధవారం ఉదయం సాక్షి దినపత్రికలో 'ఆధ్యాత్మిక క్షేత్రంలో రాజకీయ ప్రచారం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి దేవనస్థాన అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో ఫ్లెక్సీని తొలగించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్

ఆత్మకూరు: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన లేకనే కొందరు ర్యాగింగ్, రాంగ్ డ్రైవింగ్ తదితర వాటికి పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల మధ్య బాలికలు తేడా తెలుసుకుని ఉండాలని, ఎవరైనా అసౌకర్యానికి గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.సుంకన్న, ఏపీపీ బాబురాజేంద్ర ప్రసాద్, న్యాయవాదులు మాణిక్యరావు, బలరాం నాయక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

బండి ఆత్మకూరు: మండలంలోని ఏ.కోడూరు, సోమయాజుపల్లి గ్రామాల్లోని వరి పంటలను మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట ప్రస్తుతం ఈనె నుంచి పక్వదశలో ఉందని, ఇటీవల కురిసిన వర్షాలు, మబ్బులతో కూడిన వాతావరణం కారణంగా తెగుళ్ల ఉధృతి పెరిగిందని తెలిపారు. వరి తెగుళ్ల నియంత్రణకు రసాయన మందులకు బదులుగా జీవ శిలీంధ్ర నాశకాలను వాడాలని రైతులకు సూచించారు.

స్క్వాడ్ వస్తుందంటూ ముందే సమాచారం?

మహానంది: ఎక్సైజ్ శాఖలో పైస్థాయి అధికారులు తనిఖీలకు వస్తున్న విషయం బెల్ట్‌షాపుల నిర్వాహకులకు ముందే తెలిసిపోతోంది. మండలంలోని మూడు వైన్ షాపులతో పాటు మహానంది, తిమ్మాపురం, బుక్కాపురం తదితర గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ విషయంపై కొందరు రెండ్రోజుల క్రితం 14405 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో స్క్వాడ్ బృందం సోదాలకు ఉపక్రమించారు. ఈ విషయాన్ని కొందరు సిబ్బంది బెల్ట్‌షాపుల నిర్వాహకులకు చేరవేయడంతో వారు మూసేసుకుని వెళ్లిపోవడంతో స్క్వాడ్ బృందం ఏమీ చేయలేక వెనుదిరిగారు.

దొంగ పోలీసు!

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామనగర్‌లో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది పోలీసే అని తెలిసి అందరూ అవాక్కయ్యారు. పట్టణ పోలీ సు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస ఆచారి గత కొద్ది నెలలుగా విధులకు సరి గా హాజరుకాక సిక్ లీవ్‌లో ఉంటూ మద్యానికి బానిసైనట్లు తెలిసింది. మద్యం మత్తులో ఈ నెల 14వ తేదీ రాత్రి మహిళ మెడలోని బంగారు గొలుసును లాగేస్తూ ప్రజలకు దొరికిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు పోలీసుపై పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు.

క్యూఆర్ కోడ్ ఉంటేనే కొనుగోలు చేయాలి

నందికొట్కూరు: క్యూఆర్ కోడ్ ఉన్న మద్యం బాటిళ్లనే కొనుగోలు చేయాలని ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా సూచించారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బ్రాందీ షాపు ఓనర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ లేకపోతే విక్రయించొద్దన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మద్యం కొనుగోలు చేసేటప్పుడు ఈ యాప్ ద్వారా స్కాన్ చేయాలన్నారు. మద్యం బాటిళ్లపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే బాటిల్ తయారు చేసిన కంపెనీ, తేదీ, కంపెనీ, ఎమ్మార్పీ ఉంటుందన్నారు. ఎలాంటి తప్పులు వచ్చినా టోల్‌ఫ్రీ నం 14405, 94409 02576 ఫోన్ చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

- ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: అన్ని శాఖల అధికారులు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాసిరకం కోడిగుడ్లు ఇస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య సభ దృష్టికి తెచ్చారు. పడమర ప్రాతకోట ఉర్దూ పాఠశాల పక్కన ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా కోరాగా.. నిధుల కొరతతో పనులు నిలిచిపోయినట్లు సీడీపీఓ మంగవల్లి వివరణ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని సూచించారు. ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లోని పశుసంవర్ధక శాఖ వైద్యశాల భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని పీఆర్ ఏఈ జావేద్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓ సుభాన్, ఏఓ మురళీధర్, ఏఈలు క్రాంతికుమార్, అనిల్‌కుమార్, జావేద్, వార్డెన్ విజయ్‌బాబు, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం కళావతి, సూపర్‌వైజర్స్ శివగౌరీ, శేషమ్మ, మండల ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, అరుణమ్మ, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్‌లు రాజేశ్వరి, పెరుమాళ్ల శేషన్న, పెద్ద ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రయాణికులను వెళ్లకుండా రింగ్‌పార్క్ వద్ద వాహనాలను నిలిపివేస్తున్న పోలీసులు.

పీఎం పర్యటన ముందురోజే ఆంక్షలు


- ఇబ్బందులు పడిన ప్రయాణికులు, భక్తులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించనున్నారు. ఆయనతో పాటు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల భద్రత దృష్ట్యా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు, దోర్నాల నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలు నిలిపేస్తూ కలెక్టర్, ఎస్పీలు ఆదేశాలు జారీ చేశారు. కాగా డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు అత్యుత్సామంతో బుధవారం ఉదయం నుంచే ప్రయాణికుల రాకపోకలకు తరచూ అంతరాయం కలిగించారు. రింగ్‌పార్క్ వద్ద బారికేడ్లు పెట్టి స్థానికులను, శ్రీశైలంలో పనులు చేసుకునే వారిని ఇబ్బందులకు గురి చేశారు.

శ్రీశైలంలో త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి అనుమతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. దేవదాయశాఖ టెండర్లు పిలిచింది. టెండర్‌లో 33 ఏళ్ల లాంగ్ లీజ్ పద్ధతిపై శ్రీశైల దేవస్థానం రెండు ఎకరాల భూమిని శ్రీవెంకటేశ్వర లాడ్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కేటాయించింది. ఆ భూమిలో నిర్మాణాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024–2029 ప్రకారం శ్రీవెంకటేశ్వర లాడ్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారు హిల్టన్ గ్రాండ్ ఇన్ బ్రాండ్ పేరుతో త్రీ స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది.

ప్రధాని రాకతో ఒరిగేదేమీ లేదు



ప్రధాని రాకను వ్యతిరేకిస్తున్న సీపీఎం నాయకులు

పాములపాడు: ప్రధాని నరేంద్రమోదీ రాకతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి స్వామన్న అన్నారు. మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి రావడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాలయ్య, రాజు, డానియేల్, సురేష్ పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేసి రాష్ట్రానికి రండి

ఆత్మకూరు: విభజన హామీలు అమలు చేసిన తర్వాతే రాష్ట్రానికి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజా, ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, మండల అధ్యక్షులు సాయి ప్రధాని మోదీని కోరారు. మోదీ పర్యటనను నిరసిస్తూ బుధవారం డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా మోదీ పర్యటన పేరుతో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం తగదన్నారు. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యిందని ఆరోపించారు. సమావేశంలో మండల కమిటీ నాయకులు తేజ, లక్ష్మి, నరసింహానాయక్, నాయక్, జగదీష్ పాల్గొన్నారు.